ధాన్యం సేకరణకు సిద్ధం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనేందుకు యంత్రాంగం కసరత్తు

- 30 వేల మెట్రిక్ టన్నులు కొనడమే లక్ష్యం
- 11 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి
- రైతులకు అన్ని వసతులు, సరిపడా గన్నీ బ్యాగులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో 11 కేంద్రాల ద్వారా ఏప్రిల్ రెండో వారం నుంచి ధాన్యం సేకరించేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. యాసంగిలో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా, రైతులు 13,015 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి పంట దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. వరి ధాన్యం గ్రేడ్-ఏ క్వింటాల్ ధర రూ.2060, కామన్ గ్రేడ్ క్వింటాల్ ధర రూ.2040గా ఖరీదు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఎండాకాలం కావడంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేయాలని యంత్రాంగం ఆదేశించింది.

7.50 లక్షల గన్నీ బ్యాగులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించటానికి 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌర సరఫరాల శాఖ అంచనా వేసినప్పటికీ లెక్కకు మించి 8.80 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికార యంత్రాంగం తెలిపింది. అలాగే టార్పాలిన్లు, తేమ యంత్రాలు, పాడి క్లీనర్లు, కాంటాలు తది తర అవసరమైన వాటిని కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం 9 ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి (మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పూరా, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్పేట్, కీసరలలో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించాం. ధాన్యం క్రయవిక్రయాలకు సంబంధించి దళారులను ఆశ్రయించొద్దు. వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పూర్తి డేటాను సేకరిస్తారు. తహసీల్దార్లు ధాన్యం సేకరణ కేంద్రాలను పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటారు.

– రాజేందర్, మేనేజర్, పౌర సరఫరాల శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

గతంలో సేకరణ ఇలా...

- 2020-21 యాసంగిలో 11 కొనుగోలు కేంద్రాల నుంచి 5,743 మంది రైతుల ద్వారా 28,615 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేశారు.
- 2021-22 యాసంగిలో జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతుతో 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల నరికివేత కారణంగా మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలలో, మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు పవన్‌చందు, శశిధర్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, సూర్యనగర్, శ్రీనివాసనగర్, మల్లికార్జుననగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, వీకర్ సెక్షన్, ఎస్‌వీఆర్ కాలనీల్లో.., అదేవిధంగా మండలంలోని రావల్‌కోల్ గ్రామంలోని అన్ని పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్: పట్టణంలోని కిష్టాపూర్‌లో గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలోని 5వ తరగతిలో చేరుటకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ కోరారు. దరఖాస్తులో భాగంగా పాస్‌ఫోటో సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, చదువుతున్న పాఠశాల నుంచి సర్టిఫికెట్ పొంది ఉండాలని, దరఖాస్తు ధర రూ.100 చెల్లించాలన్నారు. వివరాలకు సెల్: 9704550234 నంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ శైలజ సూచించారు.

క్లుప్తంగా...

మూడుచింతలపల్లి ఎంపీడీఓగా వత్సలదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న వత్సలదేవి

శామీర్‌పేట్: మూడు చింతలపల్లి ఎంపీడీఓగా కేవీల్ వత్సలదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ నుంచి బదిలీపై వచ్చిన ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఆరు కేంద్రాలు



శ్రీచైతన్య కాలేజీలో నంబర్లు వేస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ పరీక్షలకు ఘట్‌కేసర్‌లో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కస్టోడియం తిలక్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రానికి అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలని ఆయన సూచించారు.


వ్యాధుల నివారణపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి

కీసర: గోధుమకుంట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం కీసర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ, షుగర్, బీపీ వ్యాధుల నివారణపై ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కీసర వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మంచాల కిరణ్‌జ్యోతిప్రవీణ్, డాక్టర్ కృతిక, రాంసింగ్, ఉపసర్పంచ్ ఆంజనేయులు, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి, వార్డుసభ్యులు తదితరులున్నారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థినులకు అవగాహన



శామీర్‌పేట్: అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎంతో అవసరమని, ప్రథమ చికిత్సపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌టీ జాన్ అంబులెన్స్(ఇండియా) రాష్ట్ర శాఖ సీనియర్ ట్రైనర్ కలారి సంతోష్‌కుమార్ అన్నారు. శామీర్‌పేట్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో(జగ్గిరిగుట్ట) మంగళవారం ప్రథమ చికిత్సపై విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. రెండు గంటల పాటు కార్డియాక్ అరెస్ట్, హార్ట్ స్ట్రోక్, హార్ట్‌ఎటాక్ తదితర సందర్భాల్లో నిర్వహించాల్సిన ప్రథమ చికిత్స గూర్చి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇష్రత్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

జవహర్‌నగర్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ 28వ డివిజన్ మథర్ థెరిస్సా కాలనీకి చెందిన ఆండాలమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.20 వేల చెక్కును కార్పొరేటర్ నిహారికగౌడ్‌తో కలిసి మంత్రి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేషాచారి, వెంకటేష్, మంజుల తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాంచంద్రం, డీన్‌లు

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో 'అడ్వాన్స్‌డ్ ఇన్ కంప్యూటేషనల్ ఇంటలిజెన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్' అంతర్జాతీయ సదస్సు (ఐసీఏసీఐఐ) వాల్‌పోస్టర్‌ను ఉప కులపతి రాంచంద్రం, డీన్‌లు విజయకుమార్, విష్ణుమూర్తి మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 22, 23 తేదీల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, అంతర్జాతీయ సాంకేతిక సంస్థ స్ప్రింజర్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, కంప్యూటింగ్ ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ తదితర అంశాలపై పరిశోధకులు, అధ్యాపకులు, సైంటిస్టులు తమ ఆవిష్కరణలను ఇతర నిపుణులతో పంచుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీదేవి, కోకన్వీనర్ బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మేడ్చల్: విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థలపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. మేడ్చల్‌లో మండల ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభంకాకముందే అడ్మిషన్లు తీసుకునేందుకు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నా వారిపై చర్యలు లేకుండా పోయాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి దోపిడీలకు పాల్పడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కిరణ్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అగస్త్య



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అగస్త్య

మేడ్చల్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో నిర్వహిస్తున్న నర్సరీలను జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. అత్వెల్లి, మేడ్చల్ రైల్లే కాలనీల్లో ఉన్న నర్సరీలను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. నర్సరీల నిర్వహణ, ఏ రకాల మొక్కలను పెంచుతున్నారు? మొక్కల పెరుగుదల.. వాటి నిర్వహణ వంటి విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేముల రాములు, ఎన్విరాన్మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్, సిబ్బంది ప్రియాంక, యాదగిరి తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పోచారం: వేసవిలో నీటి ఎద్దడి నివారణ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి చెప్పారు. మంగళవారం జలమండలి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కీసర: ప్రభుత్వ కంటి సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ప్రజయ్‌సాయిగార్డెన్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ నివారణకు చర్యలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో లో ఓల్టేజీ సమస్య నివారణకు అవసరమైన చోట కొత్తగా విద్యుత్ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నేతాజీనగర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన 110 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో మంత్రి మల్లన్న



మేడ్చల్: పట్టణంలోని కిష్టాపూర్ రోడ్డులో గల కేతమ్మ మల్లికార్జున స్వామి ఆలయంలో మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మల్లన్న ఆలయంలో కేతమ్మ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంత్రి మల్లారెడ్డి ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, దేవ, నరేందర్, సందీప్‌గౌడ్, హరికృష్ణయాదవ్, మధుకర్‌యాదవ్, నర్సింహ స్వామి యాదవ్, కౌడే మహేష్, గణేష్, నాగరాజు, సాయికుమార్, శివకుమార్, రమేష్, రవి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ టీచర్ల సేవలు వెలకట్టలేనివి

ఘట్‌కేసర్: అంగన్‌వాడీ టీచర్ల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మండలంలోని అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సక్కుబాయి, సంధ్యారాణి, సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ శోభారాణి, మశ్చేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, టీచర్లు సుచిత్ర, వైశాలి తదితరులు పాల్గొన్నారు.




సన్మాన గ్రహీతలతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి

మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు



వేడుకల్లో చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: మహిళలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ పోలీసులు, ఆశ వర్కర్లు, డ్వాక్రా ఆర్‌పీలను మంగళవారం ఘనంగా సన్మానించి చీరలు అందజేశారు. కార్యక్రమంలో సీఐ అశోక్, జంగయ్యయాదవ్, కౌన్సిలర్లు పద్మారావు, నస్రీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో...

జవహర్‌నగర్: భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా కార్మికులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోయడ వెంకటేష్, చెన్నాపురం యాదయ్య, సోడే కుమార్, బాబు, బూడిద వెంకటేష్, ఏఐఎఫ్‌టీయూ మల్లేష్, రమణరెడ్డి, రాములు, పలువురు మహిళలు బుజ్జమ్మ, విజయ, మంగమ్మ, రుక్కమ్మ, లక్ష్మీ, అంజమ్మ, ఎల్లమ్మ, కలమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్: వైద్యుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాలు ప్రకారం.. పట్టణానికి చెందిన అన్సారీ(45) సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు ఆటంకం కలిగించాడు. అలాగే ఆస్పత్రిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి వైద్యులను భయాందోళనలకు గురి చేశాడు. వైద్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: ప్రయాణికులు, విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణంలో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, నర్సింగ్‌రావు, రవీందర్, సేవా సమితి సభ్యులు జంగయ్యయాదవ్, పొన్నయ్య, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, రాజు, శశిధరన్, సంతోష్, వీరేందర్‌యాదవ్, కుమార్, ఖయ్యుం, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, మధు, ఆర్టీసీ కంట్రోలర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్ప కాలనీలో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగయపల్లి సుజాతశ్రీనివాస్, వైద్యులు, బీఆర్‌ఎస్ నాయకులు కన్నయ్య, ఎండీ మొహినుద్దీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాబ్ టెక్‌లుస్-2కే23

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐటీఎస్ కళాశాలలో పది రోజుల పాటు సాగిన ఫ్యాబ్ టెక్‌లుస్-2కే23 మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్, సదస్సులు, క్రీడలు నిర్వహించారు. జాతీయ స్థాయి ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నీలో ఎమ్మార్‌ఐటీఎస్ కళాశాల విన్నర్‌గా, సెయింట్ పీటర్స్ కళాశాల రన్నరప్‌గా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, పీడీ వెంకట్‌లు విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీ అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్ర

ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ ఫలితాల్లో గుండ్లపోచంపల్లి పాఠశాల టాప్



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడ్చల్‌రూరల్: ఈ విద్యా సంవత్సరం జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మెన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో గుండ్లపోచంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 17 మంది ఎంపికై జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను భారతి ఫౌండేషన్ ప్రతినిధి సతీష్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం రంగాచారిలు అందజేసి అభినందించారు. కాగా ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రతీ ఏటా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించి రూ.12వేల స్కాలర్‌షిప్‌ను ఇంటర్ వరకు అందజేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థుల ఎంపికలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులను అభినందించారు.

కష్టపడి సక్సెస్ కావాలి: మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: విద్యార్థులు కష్టపడి చదివి సక్సెస్ కావాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చిన్నపటి నుంచి సమయం వృథా చేయకుండా విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తూ ఉన్నతులుగా ఎదగాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచడమే కాకుండా తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచాలన్నారు. పాఠశాలలో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ శివరావు, ప్రిన్సిపాల్స్, కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి



బాధితురాలు పావనీ

కీసర: గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై వచ్చి ఓ మహిళ మెడలోంచి సుమారు 7 గ్రాముల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ రాజ్‌సుఖ్‌నగర్‌లో నివాసముంటున్న పావనీ తన కుమార్తెను కాలనీ సమీపంలో గల పుడమీ స్కూల్ వద్ద వదిలిపెట్టి తిరిగివస్తుండగా వెనక వైపు నుంచి వేగంగా బైక్‌పై దూసుకొచ్చిన గుర్తుతెలియని దుండగుడు పావనీని వెనక వైపు నుంచి ఒక దెబ్బకొట్టి వెంటనే మెడలో ఉన్న గొలుసును లాక్కెళ్లిపోయాడు. ఇంతలో తేరుకున్న పావనీ ఇరుగు పొరుగు వారి సాయంతో కీసర పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుషాయిగూడ అడిషనల్ డీసీపీ, ఏసీపీ వెంకట్‌రెడ్డి, తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. త్వరలో చైన్‌స్నాచర్‌ను పట్టుకుంటామని వారు హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రమేష్(ఫైల్)

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని డబిల్‌పూర్ గ్రామానికి చెందిన సంగవుల రమేష్(55) మంగళవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై 44వ జాతీయ రహదారిపై మేడ్చల్‌కు వస్తుండగా మార్గమధ్యలో అత్వెల్లి దివాన్ ఫంక్షన్ హాల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మహీంద్రా వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

క్రైం కార్నర్..

గంజాయి విక్రేతల అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులు

పోచారం: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ మల్లయ్య వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ వై జంక్షన్ వద్ద రూట్ వాచ్ చేస్తుండగా స్కూటీపై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీలు చేయగా తెల్లటి బ్యాగులో గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. ముద్దాయిలు నల్గొండ జిల్లాకు చెందిన మన్నెం ఉమేష్(19), బెల్లి రాజు(18)గా పేర్కొన్నారు. 1.250 కేజీల గంజాయి, మొబైల్ ఫోన్, హోండా యాక్టివా బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టు ద్వారా రిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం



దినేష్‌కుమార్

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాప్రా కంట్రీ ఎస్టేట్ కాలనీలో నివసించే దినేష్‌కుమార్(67) భార్య సుష్మశ్రీవాస్తవ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో కలిసి ఉంటున్నారు. దినేష్‌కుమార్ ఎస్ఎఫ్‌సీలో అసిస్టెంట్ సైంటిఫిక్‌గా పనిచేసి రిటైర్డయ్యాడు. దినేష్‌కుమార్ కుమార్తె వివాహ నిశ్చితార్థం ఉందని పెళ్లి ఖర్చులకు డబ్బులు గురించి బ్యాంకుకు వెళ్లి డబ్బులు అడగ్గా పీఎఫ్, తన పెన్షన్ కూడా తీసుకున్నాడని 2022 నవంబర్ 1వ తేదీన మేనేజర్ తెలిపాడు. ఈ విషయమై భార్య సుష్మ భర్తను నిలదీయగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో అదే నెల 2న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387